నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట





పాలమూరులో పండ్ల బండ్లు తొలగించేందుకు వచ్చిన జేసీబీని అడ్డుకొని నిరసన తెలియజేస్తున్న చిరు వ్యాపారులు

## పండ్ల బండ్లపైకి బుల్డోజర్లు

- పాలమూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట బండ్ల తొలగింపునకు యత్నం
- జేసీబీతో వచ్చిన మున్సిపల్ అధికారులు, పోలీసులు
- అడ్డుకొని రోడ్డుపై బైఠాయించిన ఫుట్‌పాత్ వ్యాపారులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 14 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు పదుల సంఖ్య లో కమర్షియల్ దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటికి ఆర్టీసీ అధికారులు టెండర్లు కూడా వేశారు. కాగా, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల ప్రధాన రోడ్డు పక్కనే పండ్ల బండ్ల వ్యాపారులు విక్రయాలు కొనసాగిస్తున్నారు. కమర్షియల్ షెటర్లు తుదిదశకు చేరుకోవడం తో శనివారం ఆర్టీసీ అధికారుల ఆదేశాలతో మున్సిపల్, పోలీసు అధికారులు తోపుడు బండ్లను బుల్డోజర్లతో తొలిగించడానికి సిద్ధమయ్యారు.ఇక్కడే కొన్నేళ్లుగా పండ్లు అమ్ముకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు బుల్డోజర్‌ను అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు.

పండ్ల వ్యాపారుల ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అక్కడకు చేరుకొని మున్సిపల్ అధికారులు, పోలీసులను నిలువరించారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని హెచ్చరించారు.

**చిరువ్యాపారులను చంపేస్తారా..**

బతుకుదెరువు కోసం వ్యాపారం చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు మా పొట్ట కొడుతున్నారు. చిరు వ్యాపారుల జోలికి వెళ్లమని క్లాక్‌టవర్ వద్ద నిలబడి సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చిండు. ఇప్పుడేమో బుల్డోజర్లను తీసుకొచ్చి వెళ్లగొడతామంటే సహించేది లేదు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి రెండు నెలల నుంచి మా బాధలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. బీఆర్‌ఎస్ సర్కారులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిరు వ్యాపారులకు అండగా నిలిచారు. ఆయన ఉన్నన్ని రోజులు మా దగ్గరకు ఎవరూ రాలేదు.

**- నర్సమ్మ, చిరువ్యాపారి**

**ఉన్నతాధికారులకు తెలియజేశాం..**

ఆర్టీసీ కమర్షియల్ షెటర్ల కోసం రూ.3లక్షల డిపాజిట్‌తో టెండర్లు వేశాం. షెటర్ల ఎదుట పండ్ల బండ్లు ఉంచితే టెండర్లు దక్కించుకున్న దుకాణదారులు వ్యాపారం ఎలా చేసుకుంటారు. ఆర్టీసీ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారం చేసుకోవడానికి అవకాశం లేదు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మరోమారు ప్రత్యేకంగా సంప్రదించి వివరిస్తాం.

**- సంతోష్‌కుమార్, ఆర్టీసీ ఆర్‌ఎం, మహబూబ్‌నగర్**



గద్వాలలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత కుర్వ విజయ్‌కుమార్

## ఛీకొట్టినా చిల్లర రాజకీయాలా..?

- సంపత్‌కు రాజోళిలో పర్యటించే దమ్ములేదు
- ఇథనాల్ కంపెనీ వద్దంటే జైల్లో పెడ్తారా?
- సీడ్ పత్తి రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- మీడియాతో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత కుర్వ విజయ్

గద్వాల, జూన్ 14 : ప్రజలు ఛీకొట్టినా సిగ్గు లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తూ రైతుల పొట్ట కొట్టడం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు తగదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత విజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టొద్దని ఆందోళన చేసిన రైతులను పోలీసులు జైలుకు పంపితే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గతంలో నీకు ఓట్లు వేసి రాజకీయ బిక్ష పెట్టిన రాజోళి మండలంలోని ఏ గ్రామానికైనా వెళ్లే దమ్ముందా? అని ఆయన సవాల్ విసిరారు. త్వరలోనే సంపత్‌కుమార్ భూములు, ఇసుక, మైనింగ్ మాఫియా గురించి బయట పెడతామన్నారు. నడిగడ్డలో చేస్తున్న అరాచకాలన్నీ పింక్ బుక్‌లో రాస్తున్నామని, పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, నష్టపోయిన ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. సీడ్ పత్తి రైతుల సమస్యలను రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌కు వివరించడానికి వెళ్తే అక్రమంగా అరెస్ట్ చేయిస్తారా అంటూ ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే సీడ్ కంపెనీలకు, ఆర్గనైజర్లకు గద్వాల జిల్లా కాంగ్రెస్ నాయకులు అమ్ముడుపోయారని అర్థమవుతున్నదని ఆరోపించారు. ముఖ్యంగా ఏర్పడి రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రైతులకు జరుగుతున్న మోసాలను రైతు కమిషన్ దృష్టికి తీసుకెళ్లకుండా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు నల్లారెడ్డి, నాయకులు పర్యటనను తప్పుదోవ పట్టించారన్నారు. సమస్యలున్న గట్టు, ధరూర్, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల్లో పర్యటించకుండా సంబంధం లేని పుటాన్‌పల్లికి షెడ్యూల్ మార్చారన్నారు. సంబంధం లేకుండా మాజీ ఎమ్మెల్యే సంపత్‌ పుటాన్‌పల్లికి వచ్చాడని, అతడి వల్లే గొడవ జరిగిందన్నారు. గొడవ చేసిన కాంగ్రెస్‌ నాయకులను వదిలి రైతు సమస్యలు లేవనెత్తిన మమ్మల్ని, కమిషన్ ఎదుట వాదనలు వినిపించకుండా అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పోరాటం చేస్తామన్నారు.



విజయకేతనం చూపుతున్న కళాశాల యాజమాన్యం చంద్రకళ వెంకట్, వెంకటయ్య, విద్యార్థులు

## రిషి విద్యార్థుల విజయఢంకా

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 14 : నీట్ ఫలితాల్లో రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి 100కు పైగా మెడికల్ సీట్లు పొందారని కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకట్, చీఫ్ అకాడమిక్ అడ్వైజర్ వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా నీట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన తరుణ్‌సాయి 550, స్వర్ణకుమారి 545, వినయ్ 525తోపాటు మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ భూపాల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి, రాఘవేంద్ర రావు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థుల విజయ బావుటా..**

మహబూబ్‌నగర్ పట్టణంలో నివాసం ఉంటున్న టీ.తరుణ్‌సాయి 550 మార్కులు సాధించి నీట్‌లో 12,286 ర్యాంకు సాధించారు. స్వస్థలం తాండూరు. నాన్న ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, అమ్మ ప్రైవేట్ టీచర్. కార్డియాలజిస్టు కావడమే లక్ష్యమని సాయితరుణ్ పేర్కొన్నాడు.

⇨ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎం.స్వర్ణకుమారి 545 మార్కులు సాధించి నీట్‌లో 14,825 ర్యాంకు సాధించారు. నాన్న లింగమూర్తి ఆటోడ్రైవర్. అమ్మానాన్న ఆశయ సాధనలో భాగంగా నిరుపేదలకు నిస్వార్థంగా సేవలు అందించడమే లక్ష్యంగా ప్రముఖ వైద్యురాలిగా పేరు గడించాలన్నదే తన ధ్యేయం అని పేర్కొంది.

⇨ మహబూబ్‌నగర్ వీరన్నపేటకు చెందిన కె.వినయ్ 525 మార్కులు సాధించి నీట్‌లో 28,017 ర్యాంకు సాధించాడు. నాన్న కె.జగదీష్ బిజినెస్ చేస్తూ చదివిస్తున్నాడని ప్రముఖ కార్డియాలజిస్టు వైద్యుడిగా ఎదగాలనే లక్ష్యం అన్నారు.

## ప్రతిభ విద్యార్థుల ప్రభంజనం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 14 : నీట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని ప్రతిభ విద్యార్థులు ప్రభంజనం చాటినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు 700 మార్కులకుగానూ సి.మంజు 593, ఎండీ డానిష్ 544, మధుకుమార్ 527, హప్షాఫాతిమా 517, మారెమ్మ 501, భీమేశ్వరి 480, సుప్రజ 477, ముజాహిద్ 473, భావన 469, జశ్వంత్ 462, తన్మయి 461, ఐశ్వర్య 452, అరుణ్ 447, మెహరాజ్ 446, ప్రణవ్‌సాయి 441, నౌషిన్ సుల్తానా 441, కే.గణేశ్ 437, అకేజఅంజుమ్ 435, శ్రీచందన 432, సిద్ధికానౌషిన్ 431, షాగుప్తా 426, షాగుప్తనాజ్ 426, రాహుల్ 426, స్ఫూర్తిరెడ్డి 422, యు.శృతి 420, జీ.ప్రణీత 418 మార్కులను సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిభ కళాశాల గౌరవ సలహాదారులు కే.మంజులాదేవి, వీ.లక్ష్మారెడ్డి, కే.విష్ణువర్ధన్‌రెడ్డి, కే.జనార్దన్‌రెడ్డి, జీ.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రతిభ కళాశాల, మెడికల్ అకాడమీ యాజమాన్య సభ్యులు


## నీట్‌లో వాగ్దేవి విజయ దుందుభి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 14 : నీట్ యూజీ-2025 పరీక్షా ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. నీట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85మంది విద్యార్థుల్లో 38పైగా మెడికల్ సీట్లు సాధించారన్నారు. వన్‌క్లాస్ ప్రత్యేక ప్రోగ్రాంతో ఇన్నోవేటీవ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్‌తో నాణ్యమైన విద్యను అందించి జాతీయస్థాయిలో మేముసైతం అంటూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించినట్లు తెలిపారు. సాధారణ విద్యార్థులను సైతం డాక్టర్లుగా మార్చిన ఘనత వాగ్దేవి కళాశాలకు దక్కిందన్నారు. ఇంతటి ఘన విజయానికి అధ్యాపకుల సమిష్టి కృషి ప్రధాన కారణమన్నారు. మట్టిలో మాణిక్యాలై ఆర్థికంగా వెనుకబడిన కొందరు నిరుపేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తూ వారి కళలను నిజం చేస్తూ డాక్టర్లుగా ఎదిగేందుకు బంగారు బాటలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి నందన్‌రెడ్డి, అకాడమీ అడ్వైజర్ యాకుబ్, ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి చెన్నయ్య, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్, సతీష్‌రెడ్డి, నాగేందర్, రాఘవేంద్రరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో వాగ్దేవి కరస్పాండెంట్, కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు

## ఆరుద్ర వచ్చిందోచ్..



గండీడ్, జూన్ 14 : రైతు మిత్రులుగా భావించే ఆరుద్ర పురుగులు ముందుగానే కనిపించాయి. తొలకరి వానలు కురవగానే నేలపై కనువిందు చేశాయి. ఎరుపు రంగు పురుగులు మృగశిరకార్తెలో బీడు భూముల్లో వర్షాలు పడగానే మట్టిలో నుంచి బయటకొస్తాయి. ఇవి రావడంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. నేలను చదును చేయగా.. చీడ పురుగుల లార్వాను ఇవి తిని పంటలకు మేలు చేస్తాయని రైతులు చెబుతుంటారు.





